# జర్మాన్

"త్రిపుర"

ఇది పసుపూ కాదు, ఆకుపచ్చా కాదు. మిరిమిట్లు గొలపదు. అంగుళం పొడవూ, నాలుగు ముఖాల అందం దీనివి. ఎన్నివస్తువులు పారేశాను? యిచ్చేశాను? యిది మాత్రం యింకా యిప్పటికీ నాదగ్గర ఉంది. ఉపయోగం లేదు. దీని ఖరీదు తెలీదు నాకు. విలువ?

హార్బర్లూ, ఏర్‌పోర్టులూ, స్టేషన్లూ నా జీవితంలోని మజిలీలని సూచిస్తాయి. అర్ధరాత్రి సమయాల్లో రైళ్లు మారడం, హార్బర్ దీపాలు మెల్లగా వెనక్కి వెళుతూ దండల్లాగ మారుతూంటే డెక్‌మీద నిలబడి నీళ్ల గలగల వినడం, ఉక్కు రంగు తెల్లవారుజాముల్లో డల్‌గా ఏర్‌పోర్టు లాంజుల్లో కూచుని నిరీక్షించడం... వెనక్కి చూస్తే, ఇవే నా జీవితంలోని మలుపుల్ని సూచిస్తున్నాయేమోనని అనిపిస్తుంది. 'విలువల' ప్రమేయం లేదు నాకు. స్థిరంగా నిలబడి, నలుగురి మధ్యా ఉండి, మనుష్యలతో, వస్తువులతో సంబంధాలూ, మమతలూ పెంచుకుంటున్నవాళ్లకి విలువలు. అయితే, దేనికీ విలువ కట్టకపోవడం?.........

'దీన్ని మీకు ఎందు కిస్తున్నానో నాకు బాగా తెలియదు. నాకు అప్పుడప్పుడు యిలా యివ్వాలని ఉంటుంది. ఈ నెల రోజుల్లోనే మీరంటే నాకు అమితమైన స్నేహభావం ఏర్పడింది. ఇంతకంటె ఖరీదైనవీ, అందంగా ఉన్నవీ నాదగ్గర మీరు చూశారు. కాని యిదే యిస్తున్నాను.'

తెల్లవారుజామున, మింగ్లడాన్ ఏర్‌పోర్ట్‌లో, నన్ను సాగనంపడానికి వచ్చి, వచ్చీపోయే విమానాలు చెవులు బద్దలుకొటుతూ శబ్దం చేస్తూంటే, ఉల్లి పొర కాగితం విప్పి, దీన్ని యిటూ అటూ తిప్పి చూపించి, నా చేతిలో పెట్టి, వీరాస్వామి అన్న మాటలు. 'సంగిరి'గా, సిగ్గుగా, భయంగా అన్న మాటలే అంటూ, మళ్లీ రద్దుచేస్తూ, వీరాస్వామి దీన్ని నా చేతిలో పెట్టాడు, నా ముఖం చూడకుండా, చూడకుండా ఉండడానికి ప్రయత్నిస్తూ, ఆ ప్రయత్నంలో నా హృదయానికి చాలా దగ్గరగా వస్తూ.

వీరాస్వామికి సిగ్గు, భయం, 'సంగిరి'తనం చాలా దూరం. కాని ఆ క్షణంలో అతని సహజ గుణాలు మాయమయిపోయాయి.

తీసుకోక ఏం చేస్తాను? ఇవ్వడం అలవాటయిన నేను!

సిగ్గు, భయం వీరాస్వామికి చాలా దూరం. 'నేషన్' ఎడిటర్‌కి నేను రాసిన ఉత్తరం చదివి, నా ఎడ్రస్ సంపాదించి, నాకు రాశాడు వీరాస్వామి. తనకి కూడా 'క్రెమటోరియా' గురించి స్థిరమైన అభిప్రాయా లున్నాయన్నాడు. వాటి గురించి ఆలోచించే ఆంధ్రులున్నారని సంతోషంగా ఉందన్నాడు. రంగూన్ వచ్చినప్పుడు తనను కలవమన్నాడు. ఉత్తరాలమీద ఉత్తరాలు కురిపించాడు, మొదటి దానికి తప్ప నేను జవాబే రాయకపోయినా. అంతేకాదు. తన మాండలే స్నేహితులకికూడా రాశాడు నన్ను చూడమని. అతని స్నేహం ధాటికి తట్టుకోవడం కష్టమయిపోయింది. క్రమంగా 'క్రెమటోరియా' అడుగున పడిపోయాయి. అతని ఉత్తరాలు ఆత్మకథరూపం దాల్చాయి. అతని ఆశయాలూ, ఆశలూ, అభిరుచులూ.

'హక్కులూ, స్వామ్యం అని అరచే వెధవల్ని హతమార్చాలి. ఎలా అనుకున్నారు? గోడకి నిలబెట్టి, చేతులెత్తించి, మెషిన్‌గన్‌తో టకటకా మని.'

'ప్రపంచం జనాభాలో ముఖ్యంగా మనదేశవు జనాభాలో నూటికి తొంభయిమంది పురుగుల్లాంటి వాళ్ళు. ఫ్లిట్‌కొట్టి చంపినట్లు చంపాలి.'

'సంగీతం ఎవరి కర్థమవుతుంది? కుస్తీలు పట్టి ఒకేసారి పదిమందిని చిత్తుచెయ్యగల వాళ్లు ఎంతమంది ఉన్నారు?'

'చచ్చిన తరువాతకూడా లక్షసేవలు చేయించుకుంటారు, యీ అధమాధమ మానవులు. కర్మలు, నెయ్యి, రబ్బిష్, కాఫిన్లు, మంత్రాలు, ప్రార్థనలు, ఏనివర్సరీలు. ఒక సెకండులో బుగ్గి అయ్యే యీ స్టుపిడ్ కళేబరానికి యిన్ని పరిచర్య లెందుకో... అందుకే మీరు క్రెమటోరియా గురించి రాసింది నాకు నచ్చింది.'

ఉత్తరాల్లో ఊహించుకున్నట్లుగా వీడు వీరాస్వామి. ఆరడుగుల రెండంగుళాల సన్నటిపొడుగు. పలచని ముఖం.

'మిమ్మల్నిచూస్తే ఎందుకు నాకు యింత సంతోషంగా ఉందో చెప్పలేను. ముఖస్తుతి అనుకోకండి. కాని మీలోని శాంతస్వభావం, ఎంత లోపలికి చూడగలిగే శక్తి, నన్ను మరింత దగ్గరగా లాగుతూంది.' అన్నాడు విశాలమైన కళ్లల్లో మెత్తటి, తెల్లని అమాయకత్వం నీడలా కదులుతూంటే. 'షన్యా' సరస్సు నీలి అలలు అతని కళ్లల్లో సున్నితంగా మెదిలాయి.

'అప్పుడప్పుడు అనిపిస్తుంది' మనదేశానికి తిరిగి వెళ్లిపోయి, దేశాన్ని మరమ్మత్తు చేద్దామని. తుడవాలి. ఇనప చీపుళ్లుపెట్టి దేశాన్ని తుడవాలి. మిగిలిన చెత్తని కాల్చాలి. ఒకసారి అంతా కాల్చి శుభ్రం చెయ్యాలి.' స్పార్క్‌స్ట్రీట్‌తో తన యింటి బాల్కనీలో నిలబడి కిందని రోడ్డుమీద ట్రాఫిక్ వేపుచూస్తూ అన్నాడు.

వాగ్నర్ 'లోహెన్‌గ్రిన్' నేపథ్యంగా విని పిస్తూంది. 'ఎల్సా'తో నిజం చెప్పడానికి బాధపడుతున్నాడు లోహెన్‌గ్రిన్. ఇక్కడి తన కార్గోబోట్ల సామ్రాజ్యాన్ని త్యజించి, దేశం వెళ్లిపోవాలంటాడు వీరాస్వామి. అంతా కొత్తగా, మొదటినుంచి మళ్లీ మొదలుపెట్టాలి. కాని......

ఎలా వదలిపెట్టడం. ఇంపల్స్ కావాలి. వదలిపెట్టి వెళ్లడానికి కావలసిన పనులు. కాగితాల పనులు, చెప్పవలసిన జవాబులు, రూల్స్, రెగ్యులేషన్స్‌ని డబ్బుతో, డబాయింపుతో పక్కకి నెట్టడం, దానిలోని విసుగు, శ్రమ—ఆ భారాన్ని తలుచుకుంటే నిస్పృహ. కాని,

వదలిపెట్టాలి. జుత్తులోంచి వేళ్లు గట్టిగా, పిచ్చిగా పీక్కుంటూ అన్నాడు. 'మా తాత సృష్టించిన సామ్రాజ్యం యిది. ఈ దేశం అంతా వ్యాపించింది. వేళ్లతోసహా ఎలా పీకడం? ఇపల్స్ కోసం కాసుక్కూచున్నాను. మీరు......'

సలహా?

విసుగూ, అలసటా వచ్చింది నాకు. నాలో ఉన్న శక్తి అది. అందరిచేతా చెప్పించుకుంటాను. నాలో అద్దం చూసుకున్నట్లు చూసుకుంటారు.

'అరవయి సంవత్సరాల చరిత్రని మీరు రద్దు చెయ్యలేరు అనుకుంటాను. చేస్తేమాత్రం, మిమ్మల్ని సూపర్‌మాన్ అనుకోవచ్చు.'

ఎందుకోగాని, వీరాస్వామికి నవ్వు వచ్చింది.

నవ్వితే, ఎంతో 'పెద్దగా' కనిపిస్తాడు. ఆ నవ్వులోనే పెంకితనం, మంకుతునం కూడా స్ఫురిస్తుంది. గోడమీద ఎత్తుగా వీరాస్వామి తండ్రి ఫోటో ఉంది. చుటూ కాగితంపువ్వులదండ. గదంతటికీ అదొక్కటే 'పాత'దనానికి కన్వెషన్‌లా కనిపిస్తుంది. తలపాగాకింద వీరాస్వామి తండ్రి కళ్లల్లో అయస్కాంతపు చూపులు దైవభక్తికి నిదర్శనాలున్నాయి. ఎదురుగా పెడెస్టల్‌మీద ఒక కార్గోబోటు మోడల్ ఏనుగుదంతంతో చేసింది, ఉంది.

వీరాస్వామి రికార్డ్ ఛేంజర్‌లోంచి రికార్డులు తీస్తూ అన్నాడు:

'బర్మా ప్రభుత్వం నాకు చిన్నప్పుడు ఒక మెడల్ యిచ్చింది. ఎందుకనుకున్నారు? కాలుతున్న యింట్లోకి జొరబడి మూడేళ్ల అబ్బాయిని పైకి తీసుకొచ్చాను. మచ్చలు యింకా ఉన్నాయి.'

మెడల్ యిచ్చిన ప్రభుత్వమే అతన్ని ఒక రేప్ కేసులో విచారణ చేసింది. అతని క్రూరత్వం భరించలేకే అతని భార్య ఆత్మహత్య చేసుకుందని అక్కడ అందరికీ తెలిసిన విషయం. అతనికింద పనిచేసేవాళ్ళు అతని మూడ్స్‌ని గ్రహించలేక, భరించలేక మసి అయిపోయారు.

వీరాస్వామి ముఖంలో 'బాల్యం' బాగా కనిపిస్తుంది. గొంగళి పురుగుల్ని సునాయాసంగా చేత్తో నలిపి చంపే బాల్యం, గ్లాసులోని పాలు తాగకుండా పిల్లిపిల్లకు పోసే బాల్యం అది. కోపంకొద్దీ ఖరీదైన గడియారాన్ని నేలకేసి కొట్టడం 'అడివి'తనం.

'మీరు అదృష్టవంతులు. మిమ్మల్ని చూస్తే నాకు అసూయగా ఉంది. ఇవాళిక్కడ. రేపు యింకెక్కడో. మీ ఆశయం నాకు వచ్చింది. ఈ సంవత్సరం మాండలేలో బుద్ధిస్ట్ ఫిలాసఫీ టీచ్ చేశారు. ఇక్కడనుంచి బేంగ్‌కాక్‌కి వెళ్తున్నారు. అక్కడ మొనాస్టరీలో ఉండడానికి.........'

బాఖ్ సంగీతం వింత అనుభూతిని కలిగిస్తుంది. స్నేహం ఏర్పడుతూంటే దానిలోని మాధుర్యాల్ని ఎక్కువ చేస్తుంది. వీరాస్వామినిచూస్తే 'జాలి' వేసింది. అంతటి సుఖాన్నిచ్చే వాతావరణంలోనూ అసంతృప్తి. ఆశయాలున్నా, వాటివేపు ప్రయాణం చెయ్యడానికి కావలిసిన ఉత్సాహాన్ని ఏదో దుష్టశక్తి అరికట్టుతూంది, హరిస్తూంది 'ఇంపల్స్' కాదు అతనికి కావలసింది. తన్ను తాను తెలుసుకోవాలి. తనకేది కావాలో తెలుసుకోవాలి. తెలుసుకోవచ్చని తెలుసుకోవాలి. తనలోంచి తను వేరుబడి తనను వేరే చూసుకోవడం నేర్చుకోవాలి. ఆ క్షణంలో, అతను ఏమిటి చెయ్యాలో, అతని గమ్యం ఏమిటో అతనికే తెలుస్తుంది. నా జీవిత విధానాన్ని చూసి అతను అసూయ చెందడం కాదు కావలిసింది. అదే చెప్పాను అతనికి. ఏదో పుస్తకంలోని పాఠం అప్పజెపుతున్నట్లు అనిపించింది.

'నిజమే అనుకోండి. కాని మిమ్మల్ని యిలా దగ్గరగాచూస్తూ, మీ మాటలు వింటూంటే మిమ్మల్ని నా గురువుగా చేసుకొని అనుసరించాలని ఉంది' అన్నాడు.

అతని మాటల్లోని విషాదం నాకు చాలా భయంకరంగా కనిపించింది.

'మీ ఆఖరి క్షణాలు ఏదో ఉత్తర హిందూస్థానం ట్రెయిన్‌లో గడుపుతారు. మీ దేహాన్ని చిన్నగుడ్డిదీపంస్టేషన్లో దింపేస్తారు. మిమ్మల్నక్కడ వదిలేసి, మెల్లగా బరువుగా వెళ్ళిపోతుంది పేసెంజర్' అన్నాడు మళ్ళీ.

......ఒక్కొక్కప్పుడు తెలుస్తుంది నాకు. నన్నుకూడా మిగతావాళ్ళ 'స్టడీ' చేస్తుంటారనీ, నా 'లోతులు' తెలుసుకోడానికి ప్రయత్నిస్తుంటారనీ, నా జీవిత విధానాన్ని, దాని 'అంతాన్ని' ఊహిస్తుంటారనీ. అలా బలంగా, లోతుగా నాకు తెలిసినప్పుడు, దానికి వ్యతిరేకంగా, వారి ఊహల్నీ, నిర్ధారణల్నీ తప్పుగా నిరూపించడానికని, 'మెలోడ్రామటిక్'గా నా విధానాన్ని మార్చగలిగే 'బాల్యపు' ప్రేరణలు, అంతర్ఘాతంగా ఉన్నా, పైకి ఒఖ్ఖసారిగా వస్తాయని కూడా నాకు తెలుస్తూనే ఉంటుంది. ఈ తెలుసుకోవడంతోనే ఆపగలగడం నా ధ్యానం, నా శిక్షణలో ఒక భాగం అనుకుంటాను. నా జీవితంలోని మలుపులకి కారణాలు యీ 'ప్రేరణలే' అని గట్టిగా చెప్పడానికి నా ప్రయాణాలే నాకు సాక్ష్యం, నా బలహీనతని నిరూపించే చిహ్నాలు.. అనికూడా అప్పుడప్పుడు.

నవ్వొచ్చింది. 'సినిమా చావులు అందరికీ రావు. అయినా, నాకు అలాంటి చావు యిష్టంలేదు. కొడుకులూ, మనుమలూ మంచం చుట్టూ కూచునుంటే, వాళ్ల కళ్లల్లోని భావాల్ని పరిశీలిస్తూ...'

'మీకున్న ఆస్తి ఏమిటి? మనవలూ, మనవరాళ్లూ కూచుని మీరెప్పుడు గుటకేస్తారా అని

చూడ్డానికి? యీ షాన్‌బాగూ, అందులోని రెండుపుస్తకాలూ, మీ పాస్‌పోర్టూ కదూ. వాళ్లందరూ వద్దులెండి. ఆ గుడ్డిదీపంకింద రగ్గుతో కప్పబడిన శవం మీదే నా ఆశని వ్యర్థం చెయ్యకండి.'

దరిదాపు శవంలాగే చూశాడు నన్ను వీరాస్వామి మొట్టమొదటిసారి. జ్వరంతోనే డేగాన్ మెయిల్ ఎక్కాను మాండలేలో. పిన్మనా వచ్చేసరికి సలసల కాగింది దేహం. రాత్రంతా అక్కడే ఆగింది ట్రెయిన్. డెలీరీయమ్‌లో పాతజీవితం అంతా పీడకల రూపంలో పునర్దర్శనం యిచ్చింది. మర్నాడంతా తోటి ప్రయాణీకుల ఆదుర్దా—కమ్యూనిస్టులు రైలుపట్టాల్ని మైన్‌చేశారనీ, ట్రెయిన్ యిక ముందుకు వెళ్లదనీ. చలిలో అక్కడక్కడ కాల్చిపారేసిన మొండిగోడల రైలుస్టేషన్లు దాటుకుంటూ డేగాన్ మెయిల్ చీమలాగ ప్రయాణం చేసింది.

వీరాస్వామి అప్యాయతా, స్నేహం, మొదటి రోజునుంచీ తెలిసింది. అతని సేవతో నాలుగురోజుల్లో పోయిన సత్తువ అంతా తిరిగివచ్చింది. ఆతని మృదువైన చేతులు దేహానికి ఎంతో ఆహ్లాదం కలిగించాయి.

రెండురోజుల తరువాత, నాకు స్పాంజ్‌బాత్ యిచ్చి,వాలుకుర్చీలో కూచోబెట్టి,దుప్పటీ మార్చుతూ, అన్నాడు: 'మీ బుద్ధిస్ట ఫిలాసఫీ, —వ్యవహారం చూసి గొప్ప బిడ్డగానో, బట్టతలతోనో ప్రత్యక్షం అవుతారనుకున్నాను. కాని యిలా టెక్సాస్ కౌబాయ్‌లాగ ఉంటారని కలలోనేనా అనుకోలేదు.'

'హామ్‌లెట్ హోరేషియోతో అన్నమాట నిజం' అన్నాను నవ్వుతూ.

'జ్వరం బాగా తగ్గి, బాగయిన తరువాత మీచేత రంగూన్‌కి ఎఱ్ఱిరంగు పూయిస్తాను' అన్నాడు.

స్టాండ్‌లో కూచుని, రంగూన్ రివర్ వేపు చూస్తూ, నీటిల్లో దీపాల దండలని కదిలిస్తూ లాంచీలూ, స్టీమర్లూ పోతూంటే, విస్కీ తాగాం. జిన్ అండ్ బిట్టర్స్. మృదువుగా షెర్రీ మధ్య మధ్యని షాంపేన్.

'దేశాన్నంతటినీ ఊపాలి. ప్రజలు నాకోసం పరితపించాలి. బాల్కనీలో నిలబడి, కిందని గుంపులు గూడిన ప్రజలు చీమతలకాయల్లా కనిపిస్తూంటే, ప్రేషన్‌గా చెయ్యి ఊపాలి,' అన్నాడు వీరాస్వామి కుర్చీలో జారబడి, కళ్లు పెద్దవిచేసి షాంపేన్ కలలుకంటూ.

ఓ పెల్ కారులో యిన్యా లేక్‌కి వెళ్లి అక్కడ చెట్లకింద చల్లటి చీకటిలో కూచున్నాం.

'నా ముత్తాత యిక్కడ టింబర్‌కూలీగా మొదలుపెట్టాడు తాత కార్గోబోట్లమీద వ్యాపారం చేశాడు. నాన్న కార్గోబోట్లు కొన్నాడు. నా చేతుల్లో కార్గోబోట్ల సామ్రాజ్యం తయారయింది. ప్రతి రివర్ పోర్ట్‌లోనూ నా బోట్లు ఉన్నాయి. నాన్న స్నేహితుల్ని రూపుమాపు లేకుండా చెయ్యగలిగాను. అడ్డుగా నిలబడ్డవాళ్లు, పోటీకి వచ్చినవాళ్లు, అడుక్కుతింటున్నారు. కట్టుబట్టల్తో తిరిగి వెళ్లారు. నేను చెయ్యని అన్యాయం లేదు. ఉపయోగించని అస్త్రం లేదు. హతం చేశాను. కొంతమందిని నా కింద జీతగాళ్లగా పడేసి ఉంచాను' అన్నాడు చీకట్లోనించి దూరంగా దీపాలను చూస్తూ.

సరస్సులో దీపాలు. బెంచీలమీద సంభాషణల ఆఖరకువచ్చిన ప్రేమికులు. జీవితంలో చాలా దూరం ప్రయాణం చేసినట్లనిపించింది. ఎందుకోగాని నా చుట్టూ నిశ్శబ్దం ఆవరించినట్లయింది. ఎంతో దూరంనుంచి వీరాస్వామి మాటలు వినిపించినట్లు తోచింది. యధార్థంలేని ఖాళీ ప్రపంచంలో తేలుతున్నట్లుగా. మిక్స్‌చేసిన డ్రింకులు తల కెక్కినట్లున్నాయి.

...ఇప్పటికీ అనిపిస్తుంది, వీరాస్వామి మాటలు నన్ను ఎడ్రస్‌చేసి చెప్పబడలేదని. తనలో తానే మాట్లాడుకున్నాడు. రిలీజ్ కావలిసివచ్చింది. నన్ను ఉపయోగించుకుంటున్నాడన్న భావంకూడా నా తలలో ఎక్కడో అడుగున నల్లగా, రహస్యంగా మెదిలింది.

'రూబీదగ్గరకు వెళ్దాం, పదండి' అన్నాడు వీరాస్వామి చెట్ల చీకట్లలోంచి లేస్తూ.

ఈ 'రూబీ'లు ప్రసాదించే సుఖంలోని విషాదపు లోతులు ఎన్నిసార్లు, ఎంత గాఢంగా తెలుసుకున్నా. కల్యాణీ, కల్యాణీ, అంధకారానికుండే దారుణ

మైన ఆకర్షణ వెలుతురుకి లేదనిపిస్తుంది. భయం కరమైన అందం అది. సర్వానికుండే సౌందర్యం, లావణ్యం యీ ప్రపంచంలో దేనికుంది, కల్యాణీ !

నీ గొలుసులోని లాకెట్‌లో యీ జర్కన్‌రాయి చాలా 'శాంతి'గా ఉండేది కల్యాణీ. మిరిమిట్లు గొల పదు. సున్నితంగా మెరుస్తుంది. చల్లని నీటితో దేహాన్ని స్నానం చేయిస్తుంది.

మఖ్‌మల్‌మీద పొందిగ్గా అమర్చిన వజ్రాలు, జాస్పర్, ఎగేట్, ఓపల్, జేడ్, ఎమెరల్డ్, రూబీ, గార్నెట్, సెఫైర్, అమెథిస్ట్, జాసింథ్, బెరిల్, టర్మలీన్, ఓనిక్స్, టోపాజ్, టర్కాజ్ ...రంగులు, మెరుపులు, కాంతులు, కిరణాలు...అన్నివందల రకాల 'రాళ్ల'లోనూ యీ జర్కన్ మృదువుగా మోడెస్ట్‌గా, సిగ్గుగా కనిపించింది నా కళ్లకి. అలాఅని అంటే,

'మీ టేస్ట్ కొంచం ఆశ్చర్యకరంగానే ఉన్నా, సజ్జెస్టివ్‌గానే ఉంది.' అన్నాడు వీరాస్వామి జర్కన్‌ని పైకి తీసి యిటూ అటూ తిప్పిచూస్తూ.

'మీలో ఒక గొప్ప గుణం ఉంది. ఏ అను భవాన్నీ కాదనరు. కాని వాటిని మీ రక్తంలోకి జొర బడ నియ్యరు. అవునా?' అన్నాడు మళ్లీ, రాత్రి అనుభవం నా కళ్లల్లో యింకా మిగిలి ఉందేమో అని పరీక్షగాచూస్తూ.

అవునో కాదో అప్పుడు చెప్పలేకపోయాను. జవాబు యిదీ అని ఊహించుకుని మాటల్లో చెప్ప దలుచుకుంటే, చెప్పడానికి ప్రయత్నిస్తే, ఒకసారిగా గర్వం, 'అహం' తెలియకుండా వెనుకపాటుగా ముట్టడిచేసి...మాటల్లో విపరీతమైన 'ట్విస్ట్', అసత్యం...బంగారు పూత...వెలిగే అసత్యం. 'నిజం యొక్క కఠోరత్వాన్ని కప్పిపుచ్చే అసత్యపు ఆకర్షణ... యివీ, నిజంయొక్క అసలు వెలుగుని చూడలేక బెద రడం, భయం; మనస్సుతో 'తెలుసు'కో గలిగినా, 'తెలుసుకోవడం' నా శిక్షణలో ఒక భాగమయినా, నేను అన్నమాటలలో ఖంగుఖంగుమని సత్యం ఎప్పుడూ మోగదనీ, ఏది నిప్పులాగ నిజమో, ఏది వేషధారణో చెప్పలేననీ......

యీ జర్కన్ రాయి, ఆ డిసెంబరు చలిలో తెల్లవారుజామున మింగ్లడాన్ ఏర్‌పోర్ట్‌లో నాచేతిలో పెట్టాడు. ఎన్ని వస్తువులు యిచ్చేశాను, పారేశాను? కాని యిది యిన్ని సంవత్సరాలూ నా దగ్గరనే ఉండిపోయింది. ఒక్కసారిమాత్రం వచ్చింది అవకాశం యిది నా దగ్గరనుంచి పోయేందుకు. కాని ఎంత కఠి నంగా వచ్చింది ఆ అవకాశం!

వీపుమీద తట్టి, వెనక్కి తిప్పించుకున్న మనిషి వీరాస్వామి అని పోల్చుకోవడం చాలా కష్టమే అయింది. తిరగేస్తున్న పుస్తకం అలా పరధ్యాన్నంగా బుక్‌స్టాల్ కౌంటర్‌మీద పడేసి, ఆశ్చర్యంగా చూశాను. వాల్టేరు స్టేషన్లో నన్ను ఎవరు పలక రిస్తారు?

'భాస్కర్‌గారు కదూ?'

గొంతుకపట్టి పోల్చుకో గలిగాను.

రాగి రంగు జుత్తు నుదుర్ని బాగా కప్పిఉంది. ఖాకీ చొక్కా జేబులు రెండూ చిరిగి వేళ్లాడు తున్నాయి.

నన్ను బలవంతంగా వాల్తేరులో దింపి, రైలు పట్టాల పక్కనుంచి నడిపించుకుపోయాడు. 'మీకున్న సామానేమిటి? షాన్ బాగూ, పాస్‌పోర్టూ, అంతేనా? ఏ ట్రెయినయితే ఏమిటి? ఎప్పుడు వెళ్లితే ఏమిటి?' అని బలవంతం చేశాడు.

సందులు. పాకలు. నేలకి అడుగుదూరందాకా దిగిన యిళ్ల తాటాకుల కప్పులు. తాటిచిప్పలు తన్ను కుంటూ పరిగెత్తుతూ ఒంటిమీద బట్టలేకుండా నల్లటిపిల్లలు. పాకలముందు రాళ్లమీద కూచుని కుండల్లోంచి డబ్బాలతో వేడినీళ్లు గుమ్మరించు కుంటుంటే కాలవలు సందుకి అడ్డంగా మడుగులు కట్టుతూ పారుతున్నాయి. కొబ్బరిచెట్ల వెనక సూర్యాస్తమయం. ఎక్కడ్నుంచో, అర్థమవని గుండెలు కోసే స్త్రీ రోదన.

వీరాస్వామి పాకలో నేలమీద చాప. మూలని హరికెన్‌దీపం. చీకటి.

గూళ్లల్లో అగ్గిపెట్టెకోసం వెతికి దీపం వెలిగించాడు. ఒకమూలని చిన్న రాళ్లకుప్ప యిటిక

ముక్కలు. గులకరాళ్లు. కోసుగా పదునుగా ఎటువంటి రాళ్లు.

నా చూపు చూసి అన్నాడు. 'పందుల్ని కొట్టడానికి.'

ఏమిటి మాట్లాడేం?

వీరాస్వామి అడుగులు తేలికగా పడుతున్నాయి అనుకున్నాను. గొంతులో బరువూ, ఆదుర్దా వినిపించలేదు అనికూడా అనుకున్నాను.

'నాలోంచి నేను వేరుబడి యిక్కడకు వచ్చాను' అన్నాడు.

ఎక్కడనుంచో చీమలు ఒకబారు కట్టి ఎక్కడికో వెళుతున్నాయి. దీపాన్ని తప్పించుకుని, పక్కగా ఆ బారు చీకట్లోకి పోతూంది. చీమల తలలు మెరుస్తున్నాయి దీపం కాంతిలో.

'అంతా యిచ్చేశాను. కొంత వాళ్లు తీసుకున్నారు. కేంపుల్లో జీవితం దుర్భరం. అందుకని యిక్కడ చేరాను.'

'దేశాన్ని మార్చాలి. ఎక్కడ్నుంచి మొదలు పెట్టాలో తెలియకుండా ఉంది. ఇక్కడ నేనంటే భయం, అసహ్యం. బోధపడ్డంలేదు.'

పాకలో వేడిగా ఉంది. వేడి ఏ నరానికి నిప్పంటించిందో, వీధిలో గట్టిగా అరుపులు, బూతులు మొదలుపెట్టింది ఒక ఆడగొంతు ఆ వేడి చీకటిలో, యినుంమీద మొద్దుబారిన కత్తితో రాసినట్లుయింది.

వీరాస్వామికి పరిధులు లేవు. సగంసగం పనులు చేతకావు. అడుగు చూడవలసిందే. శిఖరాలమీదనే నిలబడాలి.

ఏరో డ్రిడ్జి కట్టించడానికి కావలిసిన కూలీల గాంగ్‌లో చేరాడు.

'అయితే ఒకటి. మెల్లగా, తొందరలేకుండా ఆలోచించడం నేర్చుకున్నాను. మాటలు తగ్గించాను' అన్నాడు.

'మిమ్మల్ని యిలా యిన్నాళ్లకు చూడ్డం ఎంత సంతోషంగా ఉందో చెప్పలేను' అన్నాడు మళ్లీ.

మార్పుని దగ్గరగాకాకుండా, దూరంనుంచి చూడడం అలవాటయిపోయింది. మార్పులు మార్పుల్లాగ కనిపించవు.

'ఆరేళ్లయింది. థాయ్‌లాండ్‌నుంచి తిరిగి వచ్చినతరువాత రాశారు నా ఉత్తరానికి జవాబు. నలందానుంచి అని జ్ఞాపకం. ఇప్పుడు సిలోన్ వెళుతున్నారు. మీ యాత్రలు ఎప్పుడు ఆపుచేస్తారు?' అన్నాడు, చీమలవేపు చూస్తూ.

ఏది యాత్ర? ఏది 'వృత్తి'? భేదం అదృశ్యమయిపోయింది. ఒకదానిలో ఒకటి కలిసిపోయాయి. రెండింటిలోని పదునూ మొద్దుబారినట్లు అనిపిస్తుంది. కాని విరామం లేకుండా జరుగుతూనే ఉంది యాత్ర.

మరిచిపోయింది ఏదీ లేదు. గంగ వొడ్డుని, సాయంకాలం చుట్టూ మెత్తగా సాటిన్‌లాగ జారుతూ ఉంటే, రావిచెట్లమధ్యనుంచి వంకరతిరుగుతూపోయే యీ ధూళిబాటమీద మెల్లగా నడుస్తూ ఎన్నిసార్లు నడిచాం, కల్యాణీ, యీ రెండు సంవత్సరాలలో.


ఆయుర్వేద భూషణ
పండిత నోరి రామశాస్త్రులవారి

*** క్షీరవర్ధని ***

చనుబాలను వృద్ధిచేయు రసాయనము. దీనిని వాడుటవలన చనుబాలు స్వచ్ఛమై సమృద్ధిగా పసిపాపకు సరిపోవునట్లుచేసి, తలి పిల్లల యారోగ్యమును కాపాడును.

వెల 100ml రు. 3/- : 200ml రు. 5/-

*** జీవనవటి ***

ధాతు పుష్టికి, నరముల పటుత్వమునకు ప్రసిద్ధి గాంచినది. శుక్లనష్టము, నపుంసకత్వము లచే పీడింపబడు వృద్ధులకు సైతము శక్తి నిచ్చి, ఓజస్సును వృద్ధి చేయును.

వెల 30 మాత్రలు రు. 6/-

మాచే దీర్ఘవ్యాధులకు పోస్టుద్వారాకూడ సలహా యిచ్చి, ప్రత్యేక చికిత్స చేయబడును. క్యాటలాగు, సలహా ఉచితము.

డాక్టరు నోరి వెంకటేశ్వరశాస్త్రి,
A.V.A.C., A.L.I.M.
చీఫ్ ఫిజిషియను. ఆయుర్వేద నిలయం,
పోస్టుబాక్సు 32, విజయవాడ-1. ఆంధ్రప్రదేశ్.

నీ కళ్ళ అమాయకత్వంలోకి చూస్తూంటే, ఆలోచనల గొలుసు ఎక్కడో చీకట్లో ప్రారంభం అయి దూరంగా, చాలా దూరంగా తీసుకుపోయేది. నీ చుట్టూ ఒక 'గృహం' ఏర్పడేది. నీటిరంగు చిత్రంలోలాగ, మృదువుగా రంగులు స్పేస్‌లోకి జారుతూంటే, 'గృహం' ఏర్పడుతూంటే గొలుసు తెగేది. ఆ 'గృహం'లోకి అడుగుపెట్టలేకపొయ్యాను.

వస్తువులకి గొప్పశక్తి ఉంది, కల్యాణీ. అవి వెళ్ళవు పైకి. పారేశినా, యిచ్చేసినా, వాటి 'ప్రాణం' వాటితోకూడా వెళ్ళదు. ఎన్ని పారేశాను? ఎన్ని చేతులతో నిజంగా విసిరేశాను? యిచ్చేశాను? ఈ రెండేళ్ళల్లోనూ వాటి 'కసి' తీర్చుకున్నాయి. ఎంత 'పగ', ఎంత 'పట్టుదల' వాటికి? పుస్తకాలు గుట్టలుగా చేరిపడ్డాయి. కుర్చీలు. బట్టలు. ఈ జోళ్ళు. యిన్ని జోళ్ళ! ఇల్లు. గోడలు. గదిలోంచి గదికి. చుట్టూ. పైన. లోపల. ఎత్తు. వెడల్పు. జైలు.

అందుకే కల్యాణీ, ఆ గృహంలోకి అడుగుపెట్టలేకపోయాను. వీటిని కూడా విసిరేయాలి, పోవాలి.

అంతేకాదు నీకు బోధపడలేదు. నీ యింట్లో నీ కిచ్చిన 'స్వాతంత్ర్యం' నాకు అధీనం చేద్దామనుకున్నావు. నీ కళ్ళ అమాయకత్వం నీ దేహంలో లేదు. మిరిమిట్లు గొలిపే దేహాన్ని ఒక అస్త్రంలాగ ఉపయోగించదలచావు నా మీద అది 'పూలబాణం' అవలేకపోయింది, కల్యాణీ, నా మీద.

నీ ఆశయం, నీ 'కోరిక' నా బాధ్యతగా తీసుకోలేదు, తీసుకోలేక పోయాను. నిన్ను పారేయడంలో, అంతదారుణమైన ఫలితాలు ఉంటాయని ఊహించలేదు, కల్యాణీ.

ఈ 'జర్కన్'ని తిరగ్గొట్టి పంపించావు. అది నీ లాకెట్‌లో చాలా ప్రశాంతంగా, నమ్రతతో మెరిసేది. కాని వస్తువుల పగ నా మీద చాలా తీవ్రం.

ఎఱ్ఱటి మధ్యాహ్నపు ఎండలో, వాల్తేరు స్టేషన్లో, దీన్ని వీరాస్వామికి తిరిగి యివ్వబోయాను. ఏదో పాతకలలోని సందర్భం అకస్మాత్తుగా ఎదురయిపట్లు చూశాడు. తీసుకోలేదు. జ్ఞాపకం మెరిసి మాయమయిపోయింది. 'అవసరం' లేదు అతనికి. నా దగ్గరే ఉండిపోయింది.

'కొన్నాళ్ళనుంచీ ఒక కల 'నిజం' లాగ వెంటాడుతూంది, ప్రతిరోజూ. ఒక్కొక్కప్పుడు మెలకువగా ఉన్నప్పుడే. వీరాస్వామి తాతయ్య దగ్గరకి నాలుగేళ్ళ చిన్నారి మందుకని వస్తుంది. పొట్లాల మందు. తాతకి తెల్లటిగెడ్డం. ఎడమ జబ్బకి తాయెత్తు. వణుకుతూ, చాపమీద కూచుని, తెల్లటి పొట్లాలేవో కట్టిస్తాను.' అన్నాడు వీరాస్వామి విశాఖపట్నం బీచ్ యిసుకలో పడుకొని నక్షత్రాలవేపు చూస్తూ. 'ఆ పిల్ల నా ప్రజలు. వాళ్ళకి మందులు యివ్వాలి నేను. కాని మందు ఏమిటో, అది ఎలా యివ్వాలో, దాని మోతాదేమిటో నాకా కలలో కనిపించలేదు.'

మళ్ళీ అన్నాడు నా వేపు వెఱిగా చూస్తూ. 'మీతో తీసుకుపొండి నన్ను.'

'అలాగే' అన్నాను ఆలోచించకుండా.

కొంచెంసేపు ఆగి అన్నాడు. 'రాలేను. ఇక్కడే ఉండాలి. ఏదో...'

వీరాస్వామి నాతో రాలేదు. 'జర్కన్'ని తీసుకోలేదు నా దగ్గరే ఉండిపోయింది. అవకాశం వచ్చినా, నా దగ్గరనుండి వెళ్ళిపోలేదు.

నువ్వు ఆశ్చర్యపోయావు దీన్ని నీకు యిచ్చినప్పుడు. నీది 'మిలియన్ డాలర్ల' ఆశ్చర్యం కల్యాణీ! 'స్త్రీత్వం' నీలో పరిపూర్ణత చేకూర్చుకుందికి ప్రయత్నం చేస్తుంది. గొలుసులు గొలుసులుగా ఆలోచనలు మొదలుపెడతాయి నాలో. రావిచెట్ల నీడల్లో గొలుసులు. దూరంగా గంగవొడ్డుని రాసుకుంటూ, మెల్లగా మాట్లాడుకుంటూ ప్రవహిస్తూంటే, ఆకులు స్వగతం చెప్పుకుంటున్న సమయంలో, ఆ ఆకుల్లోంచి వెన్నెల మృదువుగా నీ ముఖంమీద పడుతూంటే 'ఆత్మ' దర్శనమే అవుతున్నట్లు అనిపించింది.....

......చుట్టూ కనిపించే వస్తువులూ నా అనుభవాలూ, వాంఛలూ అన్నీ నీలోనే ఉన్నాయి.

అవన్నీకూడా నువ్వే. ఏ వస్తువు కదిలించినా అది నిన్ను కదిలించినట్లే. నేను వాటివేపు చూస్తూ ఉంటే, అది నువ్వుచూస్తూ ఉన్నట్లే. నువ్వు ఎక్కడ ఉన్నావు? ఆకళ్ల వెనుక కాదు. ఆ తలలోనూ కాదు. ఆ తలలో మెదలే చీకట్లలోకాదు. అక్కడ ఏమిటవుతూందో తెలియదు నాకు. తెలుసుకోవడం అసంభవం. నాజీవం. నా ఉనికీ, నాలోకాదు, కల్యాణీ, నాముందు, ఇదిగో, యిక్కడ, పైని, నా ముందునే ఉంది. అక్కడే నువ్వు కూడా. నేనుండే ప్రపంచం మరేదీకాదు; అదే నా ఆత్మ. ఇదంతా నా ఆత్మదే అందులోనే నేనున్నాను. అందుకే నేను నీలోనే ఉన్నాను. ఇంతకంటే వేరే నిజంలేదు. నువ్వు... నువ్వు నీ శరీరం ముసుగుల వెనక ఎక్కడో లేవు, ఇక్కడ...యిక్కడ, నీ కాన్షస్‌నెస్ అంతటిలోనూ నన్ను అదుముతూ, నన్ను అందులో 'కలిగి' ఉంచుతూ, నా సర్వస్వాన్ని అందులో మిళితం చేస్తూ......

... గొలుసులు.

... గొలుసులు; విశాలంగా చెదరి, పెరిగే వలయాలు, విషవలయాలు. వెన్నెల గంగ యింద్ర జాలం ... ఆకుల స్వగతంలో మార్దవంగా ప్రమత్తత.

నీ బాధ్యత నా భుజాలమీద వేసుకోలేదు. కల్యాణీ, వీరాస్వామి నాతో మొదట వ్రేళిగా వస్తానన్నా నాతోరాలేదు. ఇలా చుట్టూ ఏర్పడే వలయాలు దాటుకుంటూ వెళ్తాంటే, ఏదోబాధ, అకస్మాత్తుగా, అనుకోని సమయాల్లో బలంగా, గాఢంగా, లోతుగా, తన ఉనికిని వెక్కిరిస్తూ తెలియజేస్తూనే ఉంది. కెరటాలలో కదిలేవి నీళ్లేనా?

యీ జర్కాన్ నాతోనే ఉండిపోయింది.

ఎందుకు తీసుకుంటాడు మళ్లీ వీరాస్వామి దీన్ని? అమ్మి, కొన్నాళ్ళ కష్టం లేకుండా గడుపుతాడా? ఇంకెవ్వరికేనా ఇవ్వగలడా? దీనికీ అతనికీ ఏ విధమైన అనుబంధంలేదు. నాలుగేళ్ల పసిపిల్లకి ఏదో మందు, ఏదో మోతాదులో యిస్తాడు.

నాగార్జునకొండ వెళుతూ వాల్తేరు స్టేషనులో వీరాస్వామి జ్ఞాపకం వచ్చి, మూడేళ్లలో ఏమి మార్పులు వచ్చాయెా చూద్దామని దిగేను.

వెన్నెలలో కొబ్బరిచెట్లు సంగీతం వింటున్నట్లు తలలూపుతుంటే, మేఘాల్లోని ఆకాశంలో నక్షత్రాలు పండుగ చేసుకుంటున్నాయి, సందు చివర్లో ఎవరిదో పెళ్లి. భయంకరమైన శబ్దంగా వస్తూంది రికార్డుల సంగీతం పాడయిన ఏంప్లిఫయర్స్‌లోంచి. పందిరిచుట్టూ పందిపిల్లలూ, పిల్లలూ. ఏవి మనిషి పిల్లలో, ఏది పంది సంతానమో తెలియకుండా నడుస్తూ పోయాను. బాగా జ్ఞాపకం లేదు వీరాస్వామి పాక ఎక్కడ ఉందో. ఇదే అని అనుకున్న చోట చిన్నమిద్దె ఉంది. గేటుకి ఎర్రరంగు ఇనప గేటు. వీధిలో గేదె. వెనక్కి తిరిగి పెళ్లిపందిరి దగ్గరగావెళ్లి నిలబడి చుట్టూ చూశాను. గాఢమైన రంగుల సిల్కుచీరలు, చాలా వేడిగా ఉంది. ఆరేళ్ల చిన్నారి, గట్టిగా లాగివేసిన జడలు రెండిట్నీ ఆకుపచ్చ రిబ్బన్లతో కట్టించుకుని, పందిరి చివర రాటకు అనుకుని పరధ్యాన్నంగా చూస్తూంది.

'వీరాస్వామి తాతయ్య తెలుసునా?' అని అడిగాను.

చూపు మరల్చి, నా వేపు జాగ్రత్తగాచూస్తూ అంది: 'పైసియ్యి.' చెంపదెబ్బ తిన్నట్లనిపించింది. జేబులోంచి ఒక కాయిన్ తీసి యిచ్చాను.

మెరిసే తెల్లటి అర్ధరూపాయిని చిన్నచేతితో పట్టుకుని, రెండుసార్లు అటూ యిటూ తిప్పి, చూసి, హఠాత్తుగా ఏదో జ్ఞాపకం వచ్చినట్లు, వెనక్కి తిరిగి పందిపిల్లల్ని తన్నుకుంటూ, తోసుకుంటూ, సగం చీకటి సందులోకి పాకిపోయింది. రెండు జడలూ, చైతన్యం వచ్చినట్లు యిటూ అటూ నవ్వుతూ ఎగురుతూంటే, సిల్కు పరికిణీ చుట్టూ నాట్యం చేస్తూంటే, చీకట్లోకి అదృశ్యం అయిపోయింది.

ఇస్త్రీ చేసిన గళ్ల లుంగీ వ్యక్తి ఒకడు నా

దగ్గరగావచ్చి అనుమానంగా చూశాడు నావేపూ, చిన్నారి పారిపోయిన సందు చివరవేపూ.

వీరాస్వామిని గురించి అడిగాను.

ఎవరికి ఎవరు కాపలా అని హోరుపెట్తోంది రికార్డు. చుట్టూ గోలలో, వెక్కివెక్కి ఏడుస్తున్నట్లు పాటపాడుతూంటే, తనని తాను వెక్కిరించుకుంటున్నట్లు ధ్వని వినిపిస్తోంది.

కొబ్బరిచెట్లు వెన్నెలలో తల లూపుతుంటే, ఎవరికి ఎవరూ కాపలా లేరనో ఉన్నారనో వెక్కివెక్కి ఏడుస్తూంటే, మనుషులు పందుల్ని కసిగా కఱ్ఱలతో అప్పుడప్పుడు బాదుతూంటే, ఎఱ్ఱ గళ్ళలుంగీ వ్యక్తి వీరాస్వామి గురించి చెప్పాడు.

బర్మా ప్రభుత్వం చిన్నప్పుడు వీరాస్వామి సాహసానికి మెడల్ యిచ్చింది. కాని ఆ పేటని కాల్చిన దావానలంలో వీరాస్వామి ఏడుమందిని రక్షించినా, రక్షిస్తూ వాళ్ళంతా కాలి మసి అయిపోయాడు.

'బతికున్నప్పుడు గీరగాడని ఒగ్గేసినాం, సచ్చి బస్మం అయ్యాక అణ్ణి తలుసుకోని రోజునేదు. పట్టుమని ముప్పయి ఏళ్ళునేవు?' అన్నాడు, ఎఱ్ఱటి కళ్ళల్లో కన్నీరు కదులుతుంటే.

గంగ అవతలిఒడున దీపాలు ఒకటీ ఒకటీ వెలుగుతున్నాయి. మౌనంగా, నీలిగా ప్రవహిస్తూంది గంగ.

ఇక్కడనుంచి కూడా వెళ్ళిపోవాలి. 'వృత్తి' పదును పోయింది. యాత్రసాగరి, ఈ సంధ్య వెలుగులో—ధూళితోనిండిన బాట తెల్లగా, సున్నితంగా తెలియని దూరంలోకి అదృశ్య మవుతోంది.

'ఆలోచనకీ' 'తెలుసుకోడాని'కీ మధ్య అఖాతం, 'ఆలోచిస్తే' 'తెలియదు'. 'తెలియడానికి' ఏమిటి చెయ్యడం?

'జెన్' సూక్తి ఒకటుంది, 'మాండో' రూపంలో. టకటకమని వేసిన ప్రశ్నలకు ఠకాఠకామని యిచ్చిన జవాబులు 'మాండో'లు.

'సీసాలో బాతుఉంది. చంపకుండా, గాయం తగలకుండా ఎలా తీస్తావ్?'

'ఆలోచించి' లాభంలేదు. దానికి ఒకటే జవాబు: 'అదిగో, అదిగో ! పైకి వచ్చేసింది!' ఆశ్చర్యార్థకాలు అక్కర్లేదు. 'ఆలోచనకి' 'తెలుసుకోడాని'కీ మధ్య ఉన్న అఖాతాన్ని వంతెనవేసి దాటలేవు.

ఒక్కసారి గెంతాలి. దుమికితే, దుమక కలిగితే బాతుపైకి వచ్చేస్తుంది. గెంత గలిగితే 'తెలుసు'కుంటావు. కాని మానవమాత్రులకు సాధ్యమేనా?

వలయాలన్నీ దాటుకుని వెళ్ళుతూంటే, దూరంగా అదృశ్యమవుతున్న బాట చివరకు వస్తూంటే, అఖాతం దగ్గరవుతున్న కొలదీ, జ్ఞాపకాలు, ఆలోచనలు, జ్ఞాపకాల భారాలు, ఆలోచనల గొలుసులు తేలికయి, బలహీనం అయి, అఖాతంలో హోరుపెట్టే జలపాతం తెలుపులు, నురగల తెలుపులు రాళ్ళమీాద హోరు, వినిపిస్తుంటే, కనిపిస్తుంటే, చెవులలో యీా అఖాతం భయంగా ఆనందంగా గర్జిస్తూంటే, అఖాతం అంచు దగ్గరకు వచ్చినప్పుడు అవతల ఒడ్డుకి గెంతి వేయగలననీ, మానవమాత్రుణ్ణి కాదననీ......

కాని, కాని...అసలు మానవుణ్నేనా అని కూడా, కూడా అనిపిస్తూనే ఉంది, లోపల లోలోపల ఎంతో లోతుల్లో......

— —